క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతుని భార్య లక్ష్మికి నగదు, ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని మొగలిపురం గ్రామానికి చెందిన జామి నూకరాజు మృతి చెందడంతో మృతుని భార్య లక్ష్మికి వైఎస్సార్ బీమా రూ.10 వేలు తక్షణ సాయం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, పార్టీ అధికార ప్రతినిధి ఐడి బాబు, గండి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

భగవద్గీతతో జ్ఞాన యోగం



పరవాడలో హిందూ ధర్మ ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

పరవాడ: భగవద్గీత ద్వారా కర్మ విధానం తెలుసుకుని జనన మరణ చక్రం నుంచి బయట పడాలని త్రైత సిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక-ప్రబోధ సేవా సమితి అనకాపల్లి కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ సూచించారు. పరవాడలో గురువారం హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో కమిటీ సభ్యులు ఇంటింట గ్రంథ పరిచయం చేశారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలు చదివి స్వామి వారి ప్రసంగాలు వినడం ద్వారా జ్ఞానులుగా మారవచ్చని శ్రీనివాస్ సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మణి, దేవి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



అప్పలరాజు

పరవాడ: మత్స్యకార జాయింట్ యాక్షన్ కమిటీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన అరిజిల్లి అప్పలరాజు నియమితులయ్యారు. అప్పలరాజు గురువారం ఓ ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు. మత్స్యకారుల అభ్యున్నతి, హక్కుల సాధన కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కంబాల అమ్మోరయ్య, కార్యదర్శి నూకరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

భారీ అన్న సమారాధన రేపు

సింహాచలం : మహా శివరాత్రిని పురస్కరించుకుని శనివారం జరిగే వేపగుంట వీరాంజనేయస్వామి ఆలయ తీర్థ మహోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ తెలిపారు. ఆలయం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో జరిగే ఈ అన్న సమారాధనకు భక్తులంతా విశేషంగా తరలి రావాలని కోరారు.

ఘనంగా ఎర్నిమాంబ విగ్రహ ప్రతిష్ట



అమ్మవారికి పూజలు చేస్తున్న 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత దంపతులు

సింహాచలం : చినముషిడివాడలోని గాంధీనగర్‌లో ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. 97వ వార్డు కార్పరేటర్ శానాపతి వసంత, శానాపతి శంకరరావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నవడ్డన చేశారు.

సింహగిరికి ఏకాదశి శోభ

- విశేషంగా ఆర్జిత సేవలు
- శాస్త్రోక్తంగా స్వర్ణ తులసీదళార్చన
- వైభవంగా నిత్య కల్యాణం



స్వర్ణ తులసీ దళాలకు నమస్కరిస్తున్న సుధా గజపతిరాజు



మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ చేస్తున్న పండితులు

సింహాచలం : ఏకాదశిని పురస్కరించుకుని గురువారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ తులసీ దళార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఆశీనులను చేశారు. 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త దివంగత పూసపాటి ఆనందగజపతిరాజు సతీమణి సుధా గజపతిరాజు ఈ పూజలో పాల్గొన్నారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు శ్రీకాంతాచార్యులు తదితరులు ఈ పూజ నిర్వహించారు.

ఘనంగా నిత్య కల్యాణం

ఏకాదశిని పురస్కరించుకుని గురువారం ఉదయం 9.30గంటల నుంచి 10.30 గంటల వరకు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ

ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై గురువారం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయ ఆస్థాన మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవి సన్నిధిలో సామూహికంగా విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశేషంగా పూజలు చేశారు.

వేడుకగా ఏకాదశి తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు



మదన గోపాలస్వామి ఉత్సవమూర్తులు

సింహాచలం : ఏకాదశిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో విశేషంగా తిరువీధి నిర్వహించారు. మదన గోపాలస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిలో ఆశీనులను చేసి హారతులు అందజేశారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాత్రీ పగలూ వెలుగులే



జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు

పరవాడ: గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా అమలు జరగడం లేదు. కాలనీలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు పగలూ రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోంది. ఈ విధంగా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎండాకాలంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అలరించిన భక్తి విభావరి



భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయనీమణులు

సింహాచలం : సింహపురికాలనీలో గురువారం జరిగిన భక్తి విభావరి విశేషంగా అలరించింది. సీతారామాలయ ఉపాలయాల 20వ వార్షికోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. శ్రీరంగం నాగలక్ష్మి ఆధ్వర్యంలో సంగీత భారతి బృందం ఆలపించిన భక్తిగీతాలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. వార్షికోత్సవాల్లో భాగంగా ఉదయం సాయినాథుడికి విశేషంగా అన్నాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సాయినాథుని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సీవీఆర్ మూర్తి, చలపతిరావు, అప్పలనాయుడు, రామారావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


కరాటే విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం



కరాటే క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

గాజువాక: ఇటీవల విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన గాజువాక ప్రాంత క్రీడాకారులకు కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి స్థానాన్ని భారత్ సొంతం చేసుకున్న ఈ పోటీల్లో విశాఖ, గాజువాక క్రీడాకారులు అద్భుత ప్రతిభ ప్రదర్శించారని కొనియాడారు. గాజువాక నుంచి హాజరైన పది మంది క్రీడాకారులలో ఆరుగురు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నిజీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్, కోచ్‌లు సాయి, కమల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పండగలు.. తీర్థ మహోత్సవాలు



ఆరిపాకలో పూజలందుకుంటున్న వీరాంజనేయస్వామి



పైడివాడ అగ్రహారంలో కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు



ఆరిపాకలో ఆకట్టుకున్న కోలాటం

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం పండగలు, తీర్థ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. పైడివాడ అగ్రహారంలో కొలువైన శ్రీకనకదర్గమ్మ అమ్మవారి పండగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆరిపాకలో వీరాంజనేయ స్వామివారి తీర్థ మహోత్సవం కనుల పండవగా జరిగింది. కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రొగ్రాం అలరించింది. ఈ సందర్భంగా స్వామివారిని సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, ఎస్‌పీ రాజు తదితరులు దర్శిచుకున్నారు. వంగలిలో శ్రీసీతారాముల తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు కనువిందు చేశాయి.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



తులసి పూజలందుకున్న కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా



అన్సర్ వలీని అభినందిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు

పెదగంట్యాడ: ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మిద్నాపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో పారిశ్రామిక క్రీడాకారులు సత్తా చాటారు. జావెలిన్ త్రో, హేమత్ త్రో, షాట్‌పుట్, 5 వేల మీటర్లు, ఐదో కిలోమీటర్ల రేస్ వాక్‌లో విజేతలుగా నిలిచి పతకాలు సాధించారు. ఏపీఈపీడీసీఎల్‌లో పని చేస్తున్న జీవీఎంసీ 77వ వార్డు పరిధి పెదపాలేనికి చెందిన అన్సర్ వలీ, స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేస్తున్న కాసు కుమార్ కాంస్య పతకాలు గెలుచుకున్నారు. విజేతలను అసోసియేషన్ అధ్యక్షుడు మంగ వరప్రసాద్, ఏపీఈపీడీసీఎల్ ఏఈ శ్రీనివాసరావు, అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

సినిమా షూటింగ్ సందడి



గోపాలపట్నం రైతుబజార్‌లో హీరోయిన్ అయేషాపై సన్నివేశం చిత్రీకరిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజార్‌లో గురువారం సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. ఉదయం 8.30 గంటలకు మొదలైన షూటింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. హీరోగా సీనియర్ నటుడు బ్రహ్మాజీ కొడుకు సంజయ్ రావు(ఓ పిట్ట కథ ఫేమ్), హీరోయిన్‌గా ముంబైకి చెందిన అయేషాల మధ్య పరిచయ సన్నివేశాలను చిత్రీకరించారు. రైతుబజార్‌లో హీరోయిన్ కూరగాయలు కొనడం.. హీరో కోసం వెతుకుతుండటం వంటి సన్నివేశాలను షూట్ చేశారు. ఈ షూటింగ్‌ను చూసేందుకు వినియోగదారులు, రైతులు ఎగబడ్డారు. కొంత మంది బజారు చేయకుండా ఖాళీ సంచులతో అక్కడే నిలబడి ఆసక్తిగా తిలకించారు. డాన్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ బ్యానర్‌పై నిర్మాత లివింగ్ స్టన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు మణి చంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు.

శిల్పారామంలో చేనేత వస్త్రాల మేళా ప్రారంభం



శిల్పారామంలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న విశ్వనాథరెడ్డి తదితరులు

పీఎం పాలెం: చేనేత కళాకారులను ప్రోత్సహించి, వారి ఆర్థికాభివృద్ధికి సహకారం అందించాలని శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి కోరారు. చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల మేళాను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేళాలో సుమారు 50 స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరు పొందిన చేనేత ఉత్పత్తులు ఈ స్టాల్స్‌లో లభిస్తాయని తెలిపారు. స్టాల్స్ నిర్వాహకులు బి.సురేష్ మాట్లాడుతూ తక్కువ లాభాలు వేసుకుని చేనేత వస్త్రాలు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యమైన జంబుఖానాలు, కార్పెట్లు, అన్నిరకాల చేనేత వస్త్రాలు ప్రదర్శనలో ఉంచామని తెలిపారు.

వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్



వెట్టిచాకిరీ నిర్మూలపై అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారులు

సింహాచలం : వెట్టిచాకిరీ నిర్మూలనపై గడిచిన రెండు రోజులుగా కార్మికశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. సర్కిల్-2 అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బుద్ధా మునిస్వామి ఆధ్వర్యంలో సర్కిల్-10 సహాయ కార్మిక అధికారి పి.విజయ్‌కుమార్, సర్కిల్-7 సహాయ కార్మిక అధికారిణి ఎం.పద్మావతి నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్, గోపాలపట్నం, కరాస, సుజాతానగర్, పెందుర్తి ఏరియాల్లో వెట్టిచాకిరి మీద అవగాహన కల్పించారు. వెట్టిచాకిరి అనేది కార్మిక సంబంధితమైన, తీవ్రమైన మానవ ఉల్లంఘన నేరమని తెలిపారు. 1970లో తీసుకొచ్చిన చట్టం ద్వారా బానిసత్వానికి గురి చేయడాన్ని ప్రభుత్వం చట్ట విరుద్ధం చేసిందన్నారు. ఈ చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. వెట్టిచాకిరీ కార్మికులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడం కోసం అందరు కలిసికట్టుగా పని చేయాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. అలాగే వెట్టిచాకిరీ కార్మికులను అదుపులో ఉంచేందుకు యజమాన్యాలు వారిని భయపెట్టడం, బలవంతంగా పని చేయించడం, శారీరక హింసకు గురి చేయడం కూడా నేరమని తెలిపారు. ఇష్టమైన చోటుకు వెళ్లే హక్కును, పనిచేసే స్వేచ్ఛను హరించడం, చట్టబద్ధంగా కనీస వేతనం పొందే హక్కును హరించడం వంటివి నేరాలని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలైన ఆహారోత్పత్తి



అమృతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సబ్బవరం: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారోత్పత్తి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ జానకి తెలిపారు. మండలంలోని అమృతపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు గురువారం అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో మనుషులు, పశుపక్ష్యాదులకు, పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. అదే విధంగా తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంట దిగుబడులను అధికంగా సాధించవచ్చన్నారు. ఖరీఫ్ పంటలకు ముందు నవధాన్యాల పంటలు వేయడంపై రైతులకు వివరించారు. 30 రకాల పీఎండీఎస్ విత్తనాల గురించి రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామపెద్ద బైలపూడి రామారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జె. శ్రీనివాస్, జి. సోమలత, ఐసీఆర్‌పీలు, ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మి



ఉపాధ్యాయుడు, ఇన్‌చార్జి హెచ్ఎం చిన్నమ్మాయిపై అసహనం వ్యక్తం చేస్తున్న విద్యాశాఖాధికారి

- విధుల్లో అలసత్వం వహించిన ఉపాధ్యాయుడు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయినికి షోకాజ్ నోటీసులు జారీ

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యా శాఖాధికారి ఎం. వెంకటలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా అమలు చేస్తున్న కృషి 50 రోజుల ప్రణాళిక గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృషి టైం టేబుల్ గురించి తెలియదన్న ఉపాధ్యాయుడు పీవీ భాస్కరరావు, తెలియజేయనందుకు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని సీహెచ్ చిన్నమ్మాయికి షోకాజ్ నోటీసులు అందజేశారు. పదో తరగతి విద్యార్థుల నోట్ బుక్స్ పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థులకు అందజేసిన బైజూస్ ట్యాబ్‌లను విద్యార్థులు ఎలా ఉపయోగిస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. 3,4,5 తరగతుల విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించారు. అనంతరం విద్యార్థులచే పాఠ్యాంశాలను చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు సీసీవై. వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



టిప్పర్ ఢీకొనడంతో మృతి చెందిన వాసనారాయణ చౌదరి



వాసనారాయణ చౌదరి (ఫైల్)

సబ్బవరం : అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారిపై సబ్బవరంలోని కొత్తరోడ్డు వద్ద గురువారం రాత్రి టిప్పర్ ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన మార్వాడీ కుటుంబానికి చెందిన నరస రామ్‌జీ కుమారుడు వాసనారాయణ చౌదరి (36) పెందుర్తి మండలంలోని బాష్యం స్కూల్ వెనుక వీధిలో భార్య, ముగ్గురు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఇతనికి పెందుర్తి జంక్షన్‌లో బోరు క్లాంపులు, నిప్పల్స్ విక్రయించే షాపు ఉంది. ఈ నేపథ్యంలో షాపు నుండి డబ్బులు వసూలు చేసుకునేందుకు సాయంత్రం 6 గంటల సమయంలో పెందుర్తి నుండి ద్విచక్ర వాహనంపై సబ్బవరం బయలుదేరి వెళ్తున్నాడు. సబ్బవరంలోని కొత్తరోడ్డు సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుండి టిప్పర్ ఢీకొని వాసనారాయణ చౌదరి తలపై నుండి వెళ్లిపోయింది. తలపై నుండి చక్రాలు వెళ్లిపోవడంతో మృతుడి తలకి హెల్మెట్ ఉన్నప్పటికీ తల నుజ్జునుజ్జు కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికులు పోలీస్‌లకు సమాచారం అందించడంతో సీఐ పి. రంగనాథం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. మృతుని ఆధార్ కార్డు, సీబుక్ ఆధారాల ద్వారా పెందుర్తిలోని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రాంతీయ హాస్పిటల్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా వెంకాయమ్మ పరస



పరసలో సందడి చేస్తున్న జనం

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెద గంట్యాడలో గంట్యాడ వెంకాయమ్మ పరసను గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గంట్యాడ గోవిందరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు సందడి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎస్సీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఉర్రూతలూగించింది. పెదగంట్యాడలోని రేలా రే రేలా కార్యక్రమం ఆకట్టుకుంది. పరస కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.